క్లుప్తంగా

రేపు మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం 6 గంటలకు ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మృత్యుంజయ హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ రామచంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. హోమం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తిగల భక్తులు ఆలయంలోని కార్యాలయంలో రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

ప్రొద్దుటూరు క్రైం : పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం వల్ల వ్యాధులు దరిచేరవని డాక్టర్ మోహన్ కాంత్ తెలిపారు. స్థానిక శ్రీనివాసనగర్‌లో గురువారం ఇంటింటి ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధుల గురించి వైద్యాధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిసరాల శుభ్రత కలిగి ఉండాలని డాక్టర్ సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగితే వ్యాధులు రావన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శోభారాణి, కమ్యూనిటీ ఆర్గనైజర్ నాగజ్యోతి, ఆరోగ్య కార్యకర్తలు అనురాధ, సుభాషిణి, ఆశా కార్యకర్త రమణమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ సదస్సుకు ఆహ్వానం

ప్రొద్దుటూరు : దాక్షిణాత్య జానపద విజ్ఞాన సంస్థ(ఫోజిల్స్), తెలుగు శాఖ, సంస్కృత విశ్వవిద్యాలయం సంయుక్తంగా తిరుపతిలో ఈనెల 8, 9, 10 తేదీల్లో 31వ జాతీయ జానపద సదస్సును నిర్వహించనున్నారు. ఈ సదస్సులో పాల్గొనాలని ఆహ్వానం అందినట్లు డాక్టర్ మూలె రామమునిరెడ్డి గురువారం తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల జానపద వేత్తలు ఈ సదస్సులో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఫోజిల్స్ ఉపాధ్యక్షుడు ఆచార్య బి.కృష్ణారెడ్డి, కార్యదర్శి ఆచార్య జి.శ్యామల, కార్యదర్శి పాకనాటి జ్యోతి నేతృత్వంలో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రాయలసీమ జానపద కళా వైభవం అనే అంశంపై తాను పత్ర సమర్పణ చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు.

ఓపెన్ హౌస్‌పై అవగాహన



ఓపెన్ హౌస్ గురించి వివరిస్తున్న ఎస్‌ఐ సుబ్బారావు

మైదుకూరు : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మైదుకూరు పోలీసులు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా గురువారం విద్యార్థులకు ఓపెన్ హౌస్‌పై అవగాహన కల్పించారు. స్థానిక మేధా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులకు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ గురించి వివరించారు. కేసులు నమోదు చేయడం, ఫైళ్ల నిర్వహణ, వైర్‌లెస్ ఆపరేటింగ్ తదితర అంశాలపై అర్బన్ ఎస్‌ఐ సుబ్బారావు విద్యార్థులకు వివరించారు.

పోలేరమ్మ గుడి చుట్టూ సీసీ రోడ్డు

బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి మఠం వద్ద ఉన్న పోలేరమ్మ గుడి చుట్టూ బుధవారం సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. బ్రహ్మంగారిమఠం ఆలయ నిధుల కింద రూ.37లక్షల అంచనాతో పనుల కోసం టెండర్లు నిర్వహించగా కాంట్రాక్టర్ రూ.29 లక్షలకు దక్కించుకున్నాడు. ఈ మేరకు నిర్మాణ పనులు చేపట్టినట్లు మఠం ఆలయ నిర్వాహకులు తెలిపారు.

అధ్యాపకురాలికి నారీ శక్తి పురస్కారం



పురస్కారాన్ని అందుకుంటున్న అనురాధ లక్ష్మి

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా పనిచేస్తున్న అనురాధ లక్ష్మికి నారీ శక్తి పురస్కారాన్ని ప్రదానం చేశారు. స్థానిక వీరబ్రహ్మేంద్ర ఆశ్రమ ట్రస్ట్, నేస్తం సేవా సమితి సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధ్యాపకురాలు అనురాధ లక్ష్మికి ఈ పురస్కారాన్ని అందజేశారు. గురువారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమెకు ప్రశంసా పత్రం, మెమెంటో అందజేసి శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, ట్రస్ట్ చైర్మన్ మాలకొండయ్య, సమితి అధ్యక్షుడు కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బండి.. అంతా తొండి

- ఇంటింటికి రాని వాహనం
- సరఫరా లేదు.. కందిపప్పు అడగొద్దు
- చిల్లర పేరుతో చిల్లులు



రామేశ్వరంలో ప్లాస్టిక్ డబ్బాతో బియ్యం తూకం వేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు రూరల్ : బియ్యం ఇంటింటికి రావడం లేదు. ఇంటింటికి వచ్చినట్లు ఆపరేటర్లు లెక్కలు రాసుకుని ప్రతి నెల బిల్లులు తీసుకుంటున్నారు. దీంతో ఎండీయూ వాహనాల ద్వారా సరుకులు ప్రజలకు సక్రమంగా చేరడం లేదన్న ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. వీధి చివరనో లేదా రేషన్ షాపుల వద్దనో కూర్చుని రేషన్ కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారు. మరికొంత మంది ఆపరేటర్లు సరుకుల పంపిణీ బాధ్యతలను డీలర్లకే అప్పగించారు. ఎండీయూ ఆపరేటర్లు వినియోగదారులకు సరుకులు అందించినా, అందించకపోయినా ప్రతి నెల వారి ఖాతాలో ప్రభుత్వం రూ.21వేలు జమ చేస్తోంది.

పంపిణీ ఇలా..

ప్రొద్దుటూరు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 69,448 తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులు ఉన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో 93, గ్రామీణ పరిధిలో 50 మొత్తం 143 రేషన్ షాపులు ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 26, మండలంలో 17 ఎండీయూ వాహనాల ద్వారా ప్రజలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నారు. అయితే కందిపప్పు రెండు నెలలుగా సరఫరా కాలేదు. బహిరంగ మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.160 నుంచి రూ.170 వరకు ధర ఉంది. అయితే పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రభుత్వం కేవలం రూ.67కే అందిస్తుండటంతో ప్రజలపై కొంత భారం తగ్గేది. డిసెంబర్, జనవరి నెలలో పంపిణీ చేసిన కందిపప్పు విషయంలో కిలోకు రూ.67 చెల్లించాల్సి ఉండగా ప్రజల వద్ద నుంచి రూ.70 తీసుకున్నారు. అరకిలో చక్కెర రూ.17 ఉండగా రూ.20 తీసుకుంటూ చిల్లరను మింగేస్తున్నారు. మరోవైపు సరుకుల పంపిణీ సమయంలో కొందరు ఎండీయూ ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్డు దారులకు కందిపప్పు, చక్కెరను పంపిణీ చేసినట్లు యంత్రాల్లో వేలి ముద్రలు వేయించుకుంటున్నారు. వాటిని బ్లాక్ మార్కెట్‌కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

క్షేత్రస్థాయిలో ఎండీయూ ఆపరేటర్లు, చౌకదుకాణ డీలర్లు ప్రజలకు బియ్యాన్ని తూకం వేసేటప్పుడు ప్లాస్టిక్ డబ్బాలను, ఇనుప డ్రమ్ములను పెట్టి తూకం వేయడంతో ప్రజలకు బియ్యం తక్కువగా వస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు వాహనాలను తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ఎండీయూ ఆపరేటర్లు, డీలర్లు కుమ్మక్కై అందినకాడికి దోచుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ప్రతి నెల ప్రభుత్వం ఒక్కో ఎండీయూ ఆపరేటర్‌కు రూ.21వేలు చెల్లిస్తున్నా అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ప్రతినెల 85 శాతం నుంచి 95 శాతం లోపే కార్డుదారులకు సరుకులు అందుతున్నట్లు సమాచారం.

అక్రమ రవాణాకు పునాది

బియ్యాన్ని కార్డుదారుల నుంచి ఎండీయూ ఆపరేటర్లే బహిరంగంగా కొనుగోలు చేస్తున్నారు. కిలో బియ్యానికి రూ.12 నుంచి రూ.14 వరకు నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. మరో రూ.4 నుంచి రూ.6 వరకు ఎక్కువగా వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీటిని పోగు చేసిన వ్యాపారులు బయటి ప్రాంతాలకు లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకులు ప్రత్యక్షంగా అక్రమ రవాణాకు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. నిత్యావసర వస్తువులు సజావుగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉగాది కన్నా ఇస్తారా?



సంక్రాంతికి కంది పప్పు ఇస్తారనుకుంటే అప్పుడు ఇవ్వలేదు. శివరాత్రి పండుగ పోయింది. కనీసం ఉగాది పండుగకైనా చౌక దుకాణాల్లో కంది పప్పు ఇస్తారా.. బియ్యం, చక్కెర తప్ప ఏ వస్తువులు చౌకదుకాణాల ద్వారా ఇవ్వడం లేదు.

– చిన్నపుల్లయ్య, కానపల్లె గ్రామం, ప్రొద్దుటూరు మండలం

రంజాన్‌కైనా ఇస్తారనుకుంటే...



రంజాన్ నెలలోనైనా చౌకదుకాణాల్లో కందిపప్పు ఇస్తారనుకుంటే ఇప్పుడు కూడా లేవంటున్నారు. పండుగ మాసంలో మాలాంటి పేదలకు కందిపప్పు ఇవ్వకుంటే ఎలా? మార్కెట్‌లో కేజీ రూ.170 పెట్టి కొనాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. గతంలో రంజాన్ తోఫా కింద చక్కెరతో పాటు బెల్లం, నెయ్యి, సేమియా, కందిపప్పు ఇచ్చేవారు. ప్రస్తుతం అలాంటివి ఏవీ ఇవ్వడం లేదు.

– షేక్ గౌసియా, ప్రొద్దుటూరు

చర్యలు తీసుకుంటాం



కందిపప్పు పై నుంచే సరఫరా కాలేదు. డిసెంబర్‌లో వచ్చిన కందిపప్పును డిసెంబర్, జనవరి నెలల్లో పంపిణీ చేశాం. రేషన్ అందరికీ అందేలా చర్యలు తీసుకుంటాం. ఎండీయూ ఆపరేటర్లు, చౌకదుకాణాల డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలుతీసుకుంటాం.

–ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున, ప్రొద్దుటూరు

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడేది మహిళలే

డీఎస్పీ భావన



మాట్లాడుతున్న డీఎస్పీ భావన

ప్రొద్దుటూరు : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతున్నది మహిళలేనని డీఎస్పీ భావన అన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కడప జిల్లా పోలీసు శాఖ, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ, వికసిత ఫౌండేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, మహిళలు వేసిన ముగ్గులను పరిశీలించిన డీఎస్పీ వాటిని మెచ్చుకున్నారు. సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి, వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం కుటుంబాన్ని తీర్చిదిద్దే శక్తి మహిళలకు ఉందన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు సహకరించిన వారందరికి కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోఆర్డినేటర్ గౌరీశంకర్, పృథ్వీ నారాయణ, దావీద్, మహి, భారతి, జ్యోతి, సలీం, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే క్రమబద్ధీకరణ అమలు



మాట్లాడుతున్న తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి

గోపవరం : ప్రభుత్వం నిబంధనల మేరకే జీఓ నంబర్ 30 ద్వారా అర్హులైన వారికి క్రమబద్ధీకరణ పథకం అమలవుతుందని తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలంలో 2019 అక్టోబర్ 15 లోపు ఇళ్లు నిర్మించుకున్నవారు క్రమబద్ధీకరణకు అర్హులని, స్లాబు, ఇటుకలతో గోడలు నిర్మించబడి రేకులతో ఇళ్లు నిర్మించుకున్న వారు ఈ పథకానికి అర్హులన్నారు. ఆయకట్టు బంజరు, రాళ్ళగుట్ట, కొండలపైన నివాసగృహాలు ఏర్పాటు చేసుకున్న వారికి ఎలాంటి అభ్యంతరం ఉండదని, అలాగే చెరువుతట్టు, వాగు, వంక, శ్మశానం, రస్తా, పబ్లిక్ పర్పస్, జాతీయ రహదారుల పక్కన ఇళ్లు నిర్మించుకున్న వారు ఈ పథకానికి అనర్హులని పేర్కొన్నారు. 2019 నాటికి ఇళ్లు నిర్మించుకున్న వారు ఆస్తిపన్ను రసీదు, కరెంటు బిల్లు, నీటి పన్ను రసీదు ఏదైనా ఒక ఆధారం చూపించాలన్నారు. అన్ని సచివాలయాల్లో క్రమబద్ధీకరణకు సంబంధించి అప్లికేషన్ పూర్తి చేసి సంబంధిత వీఆర్‌ఓ, వార్డు రెవెన్యూ సెక్రటరీకి అందజేయాలని సూచించారు. ఇళ్ల క్రమబద్ధీకరణ జరిగిన అనంతరం తహసీల్దారు సంతకంతో డిపట్టా ఇవ్వడం జరుగుతుందని, డిపట్టా మంజూరై రెండు సంవత్సరాల తర్వాత క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని, మరిన్ని వివరాల కోసం తహసీల్దారు కార్యాలయంలో సంప్రదించవచ్చని కోరారు.

భూస్వామ్య వ్యవస్థను ప్రతిఘటించాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

బద్వేలు అర్బన్ : ల్యాండ్‌సీలింగ్‌యాక్ట్‌ను రద్దు చేసి ఆ స్థానంలో ఆధునిక భూస్వామ్య వ్యవస్థను సెజ్‌ల పేరుతో తీసుకువచ్చేందుకు ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వాలు ప్రయత్నం చేస్తున్నాయని, దీనిని పేదలందరూ ప్రతిఘటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్‌జీవో హోంలో భూ బాధితులు – వలసల నివారణ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో దళితులు వందల సంవత్సరాల నుంచి సాగు చేసుకుంటూ ఉన్నప్పటికీ వారికి సాగుపట్టా గాని డీకేటీ పట్టా గాని ఇవ్వడం లేదని, ప్రస్తుతం ఆ భూములన్నీ గ్రామీణ ధనిక పెత్తందారీ వర్గాలు ఆన్‌లైన్‌లో అనర్హుల పేర్లను చేర్చుకుంటున్నారని తెలిపారు. గ్రామీణ వాస్తవ పరిస్థితులను, బాధలను ప్రభుత్వాలకు అర్థం చేసుకునే తీరిక గాని చిత్తశుద్ధి గాని లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతి గ్రామంలో పేదల ఐక్యవేదికలు ఏర్పాటు చేసి సామాజిక న్యాయం కోసం పోరాటాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. మార్చి 15 నుంచి పేద ప్రజలు భూ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్వేష్, జిల్లా కమిటీ సభ్యుడు చాంద్‌బాషా, పట్టణ, రూరల్ కార్యదర్శులు శ్రీను, వెంకటేష్, అట్లూరు, బి.మఠం మండల కార్యదర్శులు రమణయ్య, సునీల్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వీరయ్య పాల్గొన్నారు.

వీరభద్రుడికి రూ.9.84 లక్షల ఆదాయం

చాపాడు: మండల పరిధిలోని అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి భక్తులు సమర్పించిన హుండీ కానుక ద్వారా రూ.9.84 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. అల్లాడుపల్లె శ్రీ వీరభద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో గురువారం దేవదాయశాఖ అధికారి మల్లికార్జున ప్రసాద్, ఉత్సవ కమిటీ చైర్మన్ పెరుగు వీరనారాయణయాదవ్ పర్యవేక్షణలో 2024 నవంబర్ 8వ తేదీ నుంచి భక్తులు కానుక రూపంలో సమర్పించిన శాశ్వత హుండీ ఆదాయాన్ని లెక్కించారు. శ్రీనివాస గోవింద సేవా సమితికు చెందిన 50 మంది సభ్యులు హుండీల్లోని నగదును లెక్కింపులో పాల్గొన్నారు. ఈ హుండీల ద్వారా రూ.9,25,769లు రాగా, ఇదే క్రమంలో శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి అన్నదాన సత్రంలోని హుండీ ద్వారా రూ.58,717లు వచ్చింది. హుండీల ద్వారా వీరభద్రస్వామికి రూ.9,84,486లు ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలియజేశారు. హుండీల లెక్కింపును తహసీల్దారు రమాకుమారి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మేకల బాబు, శ్రీనివాస గోవింద సేవా సమితి జిల్లా అధ్యక్షులు బాలనాగిరెడ్డి, వీరనారాయణ యాదవ్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోజూ చెత్త సేకరణ చేపట్టాలి



లక్ష్మీపేటలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

చాపాడు: గ్రామాల్లో ప్రతి రోజూ చెత్త సేకరణ చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి గండికోట రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని లక్ష్మీపేట గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ప్రతి రోజూ డోర్ టు డోర్ చెత్త సేకరణ చేపట్టాలన్నారు. ఈ క్రమంలో సోమవారం నుంచి చెత్త సేకరణ విషయంలో ప్రభుత్వ ఐవీఆర్‌ఎస్ కాల్స్ ద్వారా ప్రశ్నిస్తుందన్నారు. చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేర్వేరుగా వేయడం, ప్రతి రోజు చెత్త సేకరణ జరుగుతోందా అంటి అంశాలపై ఫోన్ కాల్స్ వస్తాయన్నారు. అన్ని పంచాయతీల్లో గ్రీన్ అంబాసిడర్లకు చెత్త సేకరణపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఈఓపీఆర్డీ ధాకృష్ణవేణి, రిసోర్స్ పర్సన్ దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.

చెత్త సేకరణపై అవగాహన కల్పించండి

ప్రొద్దుటూరు రూరల్ : చెత్త సేకరణపై ప్రజలకు కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది అవగాహన కల్పించాలని డీపీఓ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని కొత్తపల్లె, గోపవరం గ్రామ పంచాయతీల్లో గురువారం సాధారణ తనిఖీల్లో భాగంగా ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. నివాస గృహాల నుంచి వచ్చే చెత్తను రోడ్లపై వేయకుండా బుట్టల్లో నింపి పారిశుద్ధ్య కార్మికులకు అందించి గ్రామాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని తెలిపారు. కొత్తపల్లె గ్రామ పంచాయతీలోని అమృతానగర్, వివేకానందనగర్, ఖాదర్‌బాద్, లక్ష్మీనగర్‌లో, గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీనివాసపురం, యానాది కాలనీల్లో ఆమె పర్యటించి తడి చెత్త, పొడి చెత్త వేరు చేయు విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రం వద్దకు వెళ్లి వర్మీ కంపోస్టు తయారు విధానంపై పలు సూచనలు ఇచ్చారు. ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, కార్యదర్శులు రామ్మోహన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం లాభదాయకం

అట్లూరు : ఆధునిక వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జొన్న, నువ్వుల పంటలు ఆశా జనకంగా ఉన్నాయన్నారు. అలాగే రైతులు యాజమాన్య పద్ధతులతో పాటు మెలకువలు పాటిస్తే క్రాసింగ్ సజ్జ లాభదాయకంగా ఉంటుందన్నారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం ద్వారా 50 శాతం సబ్సిడీతో వ్యవసాయ వ్యక్తిగత పనిముట్లు, (వాటర్ క్యారింగ్)పైపులైన్ నిమిత్తం పైపులు అందజేస్తామన్నారు. రైతులు పూర్తి సమాచారం కోసం సమీపంలోని రైతు సేవాకేంద్రంలో సంప్రదించాలన్నారు. ఇందుకోసం దరఖాస్తు చివరి తేదీ ఈనెల 15 వరకు మాత్రమే ఉందని తెలిపారు.

జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతి



జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న షాకీర్‌హుస్సేన్

ప్రొద్దుటూరు : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబుకు ఏపీ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి అధ్యక్షుడు షాకీర్‌హుస్సేన్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల రైల్వే పాస్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అందుకు అప్లికేషన్ ఫారంలో ప్రభుత్వ డాక్టర్ సంతకం, సీల్ అవసరమని తెలిపారు. 20 రోజుల క్రితం సూపరింటెండెంట్‌తో సతకం, సీల్ వేయించుకుని ఆన్‌లైన్‌లో అప్లై చేయగా రిజిస్టర్ నంబర్, సీల్ క్లారిటీ లేక పోవడంతో అప్లికేషన్ రిజెక్ట్ అయిందన్నారు. తిరిగి ఇప్పుడు అప్లికేషన్ మీద సతకం పెట్టి సీల్, రిజిస్టర్ నంబర్ డాక్టర్ వేశారని తెలిపారు. అలాగే ఆస్పత్రిలోకి అనారోగ్యంతో ఉన్న దివ్యాంగులు బ్యాటరీ ట్రై సైకిల్‌లో లిఫ్ట్‌లో రానివ్వాలని విన్నవించామన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు, జ్యోతి, కేశవ్, లక్ష్మి, వెంకటసుబ్బయ్య, అల్తాఫ్ పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

బద్వేలు అర్బన్ : ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తూ మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 23న తిరుపతి పట్టణంలోని నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న రాయలసీమ మాలల సింహ గర్జన సభకు మాలలంతా లక్షలాదిగా తరలిరావాలని మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాలరవి గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకంగా మాలలు పోరాడాలని పిలుపునిచ్చారు. ఎస్సీలను విడగొట్టే ప్రయత్నాలను అందరూ అడ్డుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీల ఐక్యతకు కృషి చేయాలని కోరారు. వర్గీకరణ చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టి మాలల సత్తాను చాటేందుకు గ్రామగ్రామాన ఉన్న మాలలు, మాల అనుబంధ కులాలు తరలివచ్చి సింహగర్జన సభను జయప్రదం చేయాలని కోరారు.

మురుగుతో సావాసం..!

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ హౌసింగ్ బోర్డు కాలనీలో మురుగు నీరు నివాసాల మధ్యకు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఓ ప్రైవేట్ స్థల యజమాని మురుగు నీరు ప్రవహించే కాలువను పూడ్చి వేయడంతో ఆ నీరంతా నివాసాల వైపు మళ్లింది. దీంతో ఇళ్ల చుట్టు చేరిన మురుగు నీరు వర్షాకాలాన్ని తలపిస్తోంది. రాత్రి సమయాల్లో దోమల పోటు, విష సర్పాల సమస్య, దుర్వాసన వస్తోందని అక్కడి ప్రజలు వాపోతున్నారు. సమస్యను గ్రామ పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లామని ప్రజలు పేర్కొన్నారు. మురుగు నీరు ఎక్కువగా చేరడంతో ఇంటి గోడలు కుంగి నెర్రెలు బారుతున్నాయని, అధికారులు స్పందించి మురుగు నీరు యధావిధిగా వెళ్లేటట్లు చర్యలు చేపట్టాలని హౌసింగ్ బోర్డు కాలనీ ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై గోపవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామకృష్ణను వివరణ కోరగా మురుగు నీరు కాలువ ఆధునీకరణకు నిధుల కోసం నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపామని తెలిపారు. తాత్కాలికంగా మురుగు నీరు వెళ్లేందుకు చర్యలు చేపట్టామన్నారు.



నివాసాల మధ్యలో నిలిచిన మురుగు నీరు

రేపటి నుంచి చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం



ప్రత్యేక అలంకరణలో చౌడేశ్వరీదేవి

ఖాజీపేట : మండలంలోని అప్పగనపల్లె పంచాయితీ రంగాపురం గ్రామంలో శని, ఆదివారాల్లో జ్యోతుల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు చౌడేశ్వరీదేవి ఆలయ కమిటీ వారు తెలిపారు. 8వ తేదీ చౌడేశ్వరీదేవికి తొగటవీర క్షత్రియులు బిందెసేవ కార్యక్రమం ఉంటుందన్నారు. అదే రోజు రాత్రి జ్యోతుల మహోత్సవం, 9వ తేదీ ఉదయం 11 గంటలలోపు జ్యోతులను అమ్మవారికి సమర్పిస్తారు. అనంతరం అమ్మవారి ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాలను తిలకించేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు రానున్నారు. గ్రామంలో వెలసిన చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయానికి సుమారు వంద సంవత్సరాల చరిత్ర ఉందని స్థానికులు చెబుతున్నారు. పురాతన ఆలయం కావడంతో కమిటీ సభ్యులు నూతన ఆలయాన్ని నిర్మించారు. గతంలో మూడేళ్లకు ఓసారి జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించేవారు. నూతన ఆలయాన్ని పతిష్ఠించిన ప్పటి నుంచి ప్రతి ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలి



మాట్లాడుతున్న రవిశంకర్

గోపవరం : పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ పేరుతో 5 కిలోమీటర్ల పరిధిలో ఉండే ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను మోడల్ ప్రైమరీ పాఠశాలలో విలీనం చేయడం తగదని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రతి పాఠశాలను బేసిక్ ప్రైమరీ స్కూల్‌గా మార్పు చేస్తామని చెప్పడం జరిగిందని, కానీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దానికి విరుద్ధంగా ప్రాథమిక పాఠశాలలను ఫౌండేషన్ పాఠశాలలుగా మారుస్తూ 3, 4, 5 తరగతులను దూర ప్రాంతాల్లోని మోడల్ ప్రైమరీ స్కూల్‌లకు తరలించడం సమంజసం కాదన్నారు. ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులను మోడల్ ప్రైమరీ స్కూల్‌లకు తరలించడం వలన ప్రైవేటు విద్యావ్యవస్థ బలోపేతం అవుతుందే గాని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలని తెలిపారు.

తెప్పోత్సవానికి ఏర్పాట్లు

కడప కల్చరల్ : నగరంలోని అమ్మవారిశాల వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం తెప్పోత్సవం నిర్వహించనున్నారు. ఆలయం వద్ద తాత్కాలిక పుష్కరిణి ఏర్పాటు చేస్తున్నారు. నిపుణులైన ఇంజనీర్ల ఆధ్వర్యంలో 40 ఇన్టు 20 సైజులో పుష్కరిణి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో తెప్పను ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రతిష్ఠించి తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికోసం తెప్పను ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు.